# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**APRIL - 2018**

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

Youtube లో satyavanichurchofchrist.com

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్యం

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 39 ఏప్రియల్- 2018 సంచిక -9

## విశ్వాస వీరులు

### ( Heroes of Faith )

సత్పురుషుల జీవితముల వలన మన జీవితములను మనము మార్చు కొనవచ్చును. మన ఆలోచనలను బట్టి లేక విను దానిని బట్టి మన ఆలోచన లుండును. అందువలన గొప్ప సత్పురుషుల యొక్కయు, వీరుల యొక్కయు జీవితములను గూర్చి మనము చదువుట ఎంతో ప్రాముఖ్యము. దుర్మార్గుల యొక్కయు, అవినీతిపరుల యొక్కయు జీవితము లను మనము బుద్ధిపూర్వకముగా చదువుచు ఇష్టపడుచున్న యెడల మన తలంపులు కూడ అట్లే తయారగును. నీతిమంతుల యొక్కయు, ఘనుల యొక్కయు జీవితములను మనము చదువుచున్న యెడల మన తలంపులు కూడ ఘనమైనవిగా యుండును.

"నీ హృదయములో నుండి జీవధారలు బయలుదేరును. కాబట్టి అన్నిటికంటె ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడు కొనుము" (సామెతలు 4:23). "సర్ప సంతానమా, మీరు చెడ్డవారై యుండి ఏలాగు మంచి మాటలు

పలుకగలరు? హృదయ మందు నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడునుగదా'' (మత్తయి 12:34).

దేవుని పరిశుద్ధ గ్రంధమందు అనేక విశ్వాసవీరుల జీవితచరిత్ర మన కొరకు వ్రాయబడి యున్నది. అది మన అదృష్టము. హెబ్రీయులకు వ్రాయబడిన పత్రిక 11వ అధ్యాయములో అనేక ఘనులను గూర్చి విశ్వాస వీరులను గూర్చి వ్రాయబడియున్నది. వారు తమ కాలమందు మానవులలో ఉన్నతులై మానవజాతి కంతటికి గొప్ప మాదిరిగా యుండిరి.

వారిని గూర్చి మనము చదువు చుండగా ప్రతి సందర్భములోను విశ్వాసమును బట్టి వారు ఘనకార్యములను చేయగల్గిరని మనము గమనించగలము. వారు లోపములు లేని మానవులు కాదు గాని, వారి కాలములోయున్న జనుల కంటె వీరు ఎక్కువ ఘనులై యుండిరి. వారిలో కొందరి జీవితములను ఈ రోజు కొంత విపులముగా తెలిసి కొందము.

హేబెలును గూర్చి దేవుని గ్రంధ మందు ఇట్లు వ్రాయబడియున్నది : "విశ్వాసమును బట్టి హేబెలు కయీను కంటె శ్రేష్ఠమైన బలి దేవునికి అర్పించెను. దేవుడతని అర్పణలను గూర్చి సాక్ష్యమిచ్చినప్పుడు అతడు విశ్వాసమును బట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతి నొందియు ఆ విశ్వాసము ద్వారా మాటలాడుచున్నాడు" (హెబ్రీ 1:4). మానవులకు మొదటిగా జన్మించిన వాడు కయీను. హేబెలు అతని సహోదరుడు. వారు ఒకే తల్లిదండ్రు లకు జన్మించినను వారి తత్వములు వేరుగా యుండెను. వారు దేవునికి తెచ్చిన అర్పణలలో వారి వివిధ

తత్వములు బయలు పర్చబడెను. హేబెలు గొర్రెలను మేపుకొనువాడు; అతడు తన మందలో తొలుచూలున పుట్టిన వాటిలో కొవ్విన వాటిని కొన్ని దేవునికి అర్పణగా తెచ్చెను. కయీను అయితే భూమిని సేద్యపరచువాడు. అతడు పొలము పంటలో కొంత యెహోవాకు అర్పణగా తెచ్చెను. యెహోవా హేబెలును అతని యర్పణను లక్ష్యపెట్టెను; కయీనును అతని యర్పణను ఆయన లక్ష్యపెట్ట లేదు. అందువలన కయీను తన తమ్ముడైన హేబెలు మీదపడి అతనిని చంపెను.

మానవులలో ఇది ప్రథమ నరహత్య. ఇది ఘోరమైనది. అసూయ చేత నింపబడిన హృదయములో నుండి ఆ దుష్క్రియ బయలు వెడలెను. హేబెలు విశ్వాసముతో తన అర్పణను అర్పించినందున అతని యర్పణ అంగీకరింపబడెను. దేవుని వాక్యమును వినుట ద్వారా విశ్వాసము కలుగును (రోమా 10:17). అతడు దేవుని వాక్యమును విని విశ్వసించి దానికి లోబడెను. కయీను అయితే దేవుని మాటను వినినను తన స్వేచ్ఛనే జరిగించుకొనెను. తిరస్కరించబడెను. నీ ఆరాధనను దేవుడు అంగీకరించ వలెనని కోరుచున్నావా? అయితే హేబెలు మాదిరి ననుసరించుము. నీ స్వేచ్ఛను బట్టి గాక, దేవుని మాట ప్రకారము ఆయనను ఆరాధించుము.

"విశ్వాసమును బట్టి హనోకు మరణము చూడకుండునట్లు కొనిపోబడెను; అతడు కొనిపోబడక ముందు దేవునికిష్టుడై యుండెనని సాక్ష్యము పొందెను; కాగా దేవుడతని కొనిపోయెను గనుక అతడు కనబడ లేదు" (హెబ్రీ 11:5). హనోకు ఆదాము మొదలుకొని యేడవ తరము వాడు (యూదా :14). అతడు 360 సంవత్సరములు బ్రదికెను. అతడు దేవునితో నడిచెను. దేవుడతని కొని పోయెను. అతడు మరణమును రుచి

చూడకుండ జీవములోనికి దాటి పోయెను (ఆది 5:22-24). విశ్వాసమును బట్టి అతడట్టి స్థితిలోనికి కొనిపోబడెను.

"విశ్వాసమును బట్టి నోవహు అదివరకు చూడని సంగతులను గూర్చి దేవుని చేత హెచ్చరింపబడి, భయ భక్తులు గలవాడై తన యింటి వారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధము చేసెను. అందువలన అతడు లోకముమీద నేరస్థాపన చేసి విశ్వాసమును బట్టి కలుగు నీతికి వారసుడాయెను" (హెబ్రీ 11:7). ఆదాము మొదలుకొని నోవహు తొమ్మిదవ వాడు. అతని కాలపు ప్రపంచము పాపముతో నిండి యుండుటవలన దేవుడు వారినందరిని గొప్ప జలప్రళయము ద్వారా నాశనము చేసెను. అయితే నోవహును అతని కుటుంబమును ఒక ఓడ ద్వారా దేవుడు రక్షించెను. నోవహు యెహోవా దేవుని యందు కృపపొందెను (ఆది 6:3). విశ్వాసము వలన దేవుడతని జీవితము నంగీకరించెను. ఒక గొప్ప జల ప్రళయము రాబోవుచున్నదని దేవునిచే హెచ్చరింపబడగా విశ్వాసమును బట్టి అది యథార్థమని అతడంగీకరించెను. విశ్వాసమును బట్టి అతడొక ఓడను సిద్ధపరచెను. తనకుగా తానును, తన కుటుంబమును రక్షించుకొనగల్గెను. మన రక్షకుడైన యేసుయొక్క అడుగు జాడలలో నడుచుచు నిత్య జీవితములో ప్రవేశింపజేయునట్టిది విశ్వాసము.

"అబ్రహాము పిలువబడినప్పుడు విశ్వాసమును బట్టి ఆ పిలుపునకు లోబడి, తాను స్వాస్థ్యముగా పొందనై యున్న ప్రదేశమునకు బయలు వెళ్ళెను. దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడునై యున్నాడో, పునాదులు గల ఆ పట్టణము కొరకు అబ్రాహాము ఎదురు చూచుచుండెను" (హెబ్రీ 11:8-18). హెబ్రీయుల గోత్ర కర్తయైన అబ్రాహాము విశ్వాసుల తండ్రియని పిలువబడెను. విశ్వాసము వలన అబ్రాహాము దేవునికి

విధేయుడయ్యెను, విశ్వాసము వలన వాగ్దత్త దేశములో పరవాసిగా జీవించెను. దేవుని పట్టణమగు పరలోకము కొరకు ఎదురుచూచెను. నిజ విశ్వాసము క్రియాపూర్వకమైనది. అది ఆరాధించును, అది నడుచును, అది నిర్మించును, అది విధేయత చూపును. అది పరలోకము కొరకు ఎదురు చూచును.

విశ్వాస వీరులలో తరువాత మోషే మనకు కన్పడుచున్నాడు. అతడు ఇశ్రాయేలీయుల గొప్ప నాయకుడు. వారికి ధర్మశాస్త్రము ననుగ్రహించిన వాడు. వారినొక జనాంగముగా తయారు చేసినవాడు. విశ్వాసము వలన అతడు ఐగుప్తు దేశపు కిరీటమును విసర్జించి దేవుని ప్రజలతో శ్రమలనుభవించుట మేలని యోచించెను. రాజాగ్రహమునకు భయపడక, విశ్వాసము వలన అతడు ఐగుప్తును విడిచిపోయెను. విశ్వాసమును బట్టి అతడు పస్కాను ఆచరించెను. విశ్వాసమును బట్టి అతడును, ఇశ్రాయేలీయులును పొడినేల మీద నడిచినట్లు ఎర్రసముద్రములోబడి నడిచి పోయిరి. ఇకను ఏమి చెప్పుకొందుము? విశ్వాసమును బట్టి దేవుని కొరకు ఘన కార్యములను చేసిన విశ్వాస వీరులందరిని గూర్చి చెప్పుకొనుటకు మనకు సమయము చాలదు. అందువలన మీరు హెబ్రీ 11వ అధ్యాయమును ఒకసారి చదవండి. అయితే వారందరి జీవితముల నుండి కొన్ని పాఠములను మనము నేర్చుకొనవలెనని దేవుడు కోరుచున్నారు.

దేవుడే సర్వప్రాణులకును, శక్తికిని ఆధారభూతుడు. ఆయనయందే మనము బ్రతుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికిని కలిగియున్నాము. మన హృదయమందున్న విశ్వాసమును బట్టి ఆయనకు సన్నిహితముగా మనము జీవించగలము. ఘన కార్యములను సాధించుటకు,

విశ్వాసము లేని వారికంటె శ్రేష్ఠమైన జీవితమును జీవించుటకు విశ్వాసము మనకు శక్తినిచ్చును.

విశ్వాసము దేవుని వాక్యమును వినుట వలన లేక చదువుట వలన కలుగును. మనము వినునప్పుడు లేక చదువునప్పుడు విశ్వాసమును పొంద గలము. మనకు దేవుని కుమారుని యందు విశ్వాసమున్న యెడల మనము శక్తి గలవారము. క్రీస్తునామము నందు విశ్వాసముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను (యోహాను 1:12). "యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు; క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" అని పరిశుద్ధాతుడు పలికెను (గలతీ 3:26,27). నీవు క్రీస్తు కొరకు ఘనమైన జీవితమును జీవించగోరుచున్నావా? అయితే విధేయత చూపించు విశ్వాసము గలవాడవై జీవించుము.

## బైబిలును నమ్ముటకు కారణములు

### ( Reasons to Believe the Bible)

బైబిలు దైవావేశము వలన కలిగినదని చెప్పుకొనుచున్నది. "దైవ జనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును తప్పుదిద్దుటకును నీతియందు శిక్షణ చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమో 3:16,17). దైవావేశము అనుమాట థియోనూస్టాస్ అను గ్రీకు పదమును పౌలు వినియోగించాడు. అనగా దేవుని ఊపిరి వలన కలిగిన మాటలని యర్థము.

## దైవావేశము

దైవావేశాన్ని పేతురు ఇట్లు వివరించాడు. "ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" (2 పేతురు 1:21). దేవుడేమైనా చెప్పగా, మానవుడు దానిని లిఖించాడు. ప్రవక్తల కాలములో దైవావేశము ఇట్లు పనిచేసి నది (హెబ్రీ 1:5, 8; 5:5,6).

పాత నిబంధన లేఖకులు, క్రొత్త నిబంధన లేఖకులు కూడా దైవావేశము వలన వ్రాసినట్లు చెప్పుకొన్నారు. యెషయా 1:1,2,10,24; యిర్మీయా 1:1, 2; 2:1; యెహెజ్కేలు 1:1-3; 1థెస్స 2:13; 2పేతురు 3:2). పాత నిబంధన లేఖనములు దైవావేశములని యేసు గమనించారు. అవి అధికార పూరితమైనవని ఆయన గుర్తించారు. (మత్తయి 4:4,7,10). పాతనిబంధన ప్రవచనములను నెరవేరుస్తు దేవుని చిత్తమును జరిగించుటకే ఆయన ఈ లోకమునకు వచ్చెను. (మత్తయి 5:7-18; యోహాను 15:25). పాత నిబంధన లేఖకులు దైవావేశము కలిగిన వారని క్రొత్త నిబంధన లేఖకులు గుర్తించారు. (అపొ.కా. 1:15, 16; 4:25, 28:25-27, గలతీ 3:16-19).

క్రొత్త నిబంధన లేఖకులు కూడా తాము దైవావేశముచే వ్రాయుచున్నట్లు చెప్పుకొన్నారు. అపొస్తులులు పరిశుద్ధాత్మ వలన నడిపించబడుదురని యేసు చెప్పారు (యోహాను 14:25, 26; 16:12,13; హెబ్రీ 2:1-4). పౌలు యొక్క వ్రాతలను గూర్చి పేతురు సవిస్తరముగా ఇట్లు చెప్పాడు : "మరియు మన ప్రభువు యొక్క దీర్ఘ శాంతము రక్షణార్థమైనదని యెంచుకొనుడి. అలాగు మన ప్రియ సహోదరుడైన పౌలు కూడ తనకు అనుగ్రహించబడిన జ్ఞానము చొప్పున

మీకు వ్రాసియున్నాడు. వీటిని గూర్చి తన పత్రికలన్నిటిలోను బోధించుచున్నాడు. అయితే వాటిలో కొన్ని సంగతులు గ్రహించుకొనుటకు కష్టమైనవి. వీటిని విద్యాహీనులును, అస్థిరులైవ వారును తక్కిన లేఖనములను అపార్థము చేసినట్లు తమ స్వకీయనాశనమునకు అపార్థము చేయుదురు" (2పేతురు 3:15,16).

## వైజ్ఞానికంగా యదార్థము

అయితే ఇట్టి అంతరంగ ఆరోపణలు రుజువుకాకపోతే అవి నిష్ప్రయోజనము. గనుక వాటి యదార్థతను మనం పరిరక్షించాలి. బైబిలు దేవుని నుండి కలిగినదని మనము తెలిసికొనగలము. ఏలయనగా మానవునికెరుక లేని అనేక వైజ్ఞానిక సంగతులు దానిలో వ్రాయబడియున్నాయి. ఆదికాండము 1:11, 12, 21,24,25 వచనాలలో వాటి వాటి జాతి ప్రకారము అనే మాటలు మనకు కనబడ్తాయి. యివి గడ్డి, చెట్లు, చేపలు, పక్షులు, జంతువులు మొ॥గు వాటిని గూర్చి చెప్పబడిన మాటలు. ఇవన్నీ వాటికవే కలిగినవని గాక వాటి వాటి జాతి ప్రకారము వ్యాప్తిజెందునట్లు సృజింపబడెను.

ఎనిమిది దినముల వయస్సు గల శిశువు రక్తములో గాయములను మాన్పు కణములుద్భవించునని ఆధునికంగా వైద్యులు కనుగొన్నారు. గాని కొన్ని వేల సంవత్సరముల క్రితమే మగశిశువులు ఎనిమిదవ దినమున సున్నతి చేయబడవలెనని మోషే బైబిలు నందు వ్రాసాడు (లేవీ 12:3). అంటు వ్యాధులు కలవారిని ఎడముగా యుంచాలని ఆధునిక వైద్యులు తెలిసికొనకముందు నుండే, బైబిలు లేవీ 13:46లో కుష్టురోగులను ఎడముగా యుండాలని హెచ్చరించింది. "అపోడ వానికి కలిగిన దినములన్నియు వాడు అపవిత్రుడై యుండును, వాడు అపవిత్రుడు గనుక ప్రత్యేకముగా

నివసించవలెను". వాని నివాసము పాళెమునకు వెలుపల యుండవలెను. "మరియు అపొడ గల కుష్ఠరోగి వస్త్రములను చింపివేయవలెను; వాడు తల విరియ బోసుకొనవలెను, వాడు తన పై పెదవి కప్పుకొని అపవిత్రుడను, అపవిత్రుడను అని బిగ్గరగా పలుక వలెను" (లేవీ 13:45). పూర్వమందు అమెరికా అధ్యక్షుడగు జార్జివాషింగ్టన్ కాలములో రక్తము కారిపోతే రోగము పోయేదని తలంచారు, గాని ఇప్పుడైతే రక్తమే ప్రాణమని వైద్యులు అంగీకరిస్తారు. దీనిని మోషే బైబిలులో ఎప్పుడో వ్రాసాడు (ఆది.కా. 9:4; లేవీ 17:11, 14).

నదులన్నియు తమ నీటిని సముద్రములో పడవేయుచున్నట్లు అగుపడుచున్నను, ఈ భూమి ఎందుకు నిండిపోవుటలేదు? అని మనం అడుగ వచ్చును. సొలొమోను ద్వారా దేవుడు దానికి జవాబిచ్చారు. "నదులన్నియు సముద్రములో పడును; అయితే సముద్రము నిండుటలేదు; నదులు ఎక్కడ నుండి పారివచ్చునో అక్కడికే అవి ఎప్పుడు మరలిపోవును. ఎడ తెరపి లేకుండా సమస్తము జరుగు చున్నది. మనుష్యులు దానిని వివరింప జాలరు" (ప్రసంగి 1:7,8). "మేఘములు వర్షముతో నిండి యుండగా అవి భూమి మీద దాని పోయును" (ప్రసంగి 11:3). "సముద్రములను పిలిచి వాటిని భూమి మీద ప్రవహింపజేయు వాడు ఆయనే" యని ఆమోసు కూడ సొలొమోనుతో ఏకీభవించు చున్నాడు (ఆమోసు 9:6).

బైబిలులో అద్భుతములు చేసిన వారు, దేవుని దరుపున చేయుచున్నా మని చెప్పుకొనిరి. మోషేదేవుని శక్తి వలన చేయుచున్నట్లు ఇశ్రాయేలీ యులు గ్రహించుకొనునట్లు ఆయన మోషేకు సూచనక్రియలు చేసే శక్తినను గ్రహించెను (నిర్గమ 4:1-5). ఐగుప్తు దేశము మీద ఆయన మోషే ద్వారా కలుగుజేసిన పదితెగుళ్ళును,

పరమందొక దేవుడున్నాడని, మోషే ఆయన సేవకుడని గుర్తింపు పొందునట్లు వాటిని కలుగజేసెను (నిర్గమ 7:5, 17; 8:10,22; 9:14,29; 10:2; 11:7; 13:3; 14:14). యేసు దేవుని కుమారుడని నిరూపించుట కొరకు ఆయన మృతులలో నుండి లేపబడెను (రోమా 1:4). అపొస్తులులు చేసిన అద్భుత కార్యముల ద్వారా వారు చెప్పేది దేవుని వాక్యమేయని నిర్ధారించబడెను (మార్కు 16:14-20; హెబ్రీ 2:3,4)

**భౌగోళికంగా బైబిలు యదార్థము :**

బైబిలు భౌగోళికముగా యదార్థము. బైబిలు చెప్పు ప్రదేశములు, స్థలములు, పట్టణములు యదార్థము. యేసు ఒక ఉపమానము చెప్పెను. "ఒక మనుష్యుడు యెరూషలేము నుండి యెరికో పట్టణమునకు దిగివెళ్ళుచు దొంగల చేతిలో చిక్కెను; వారు అతని బట్టలు దోచుకొని అతని కొట్టి కొనప్రాణములతో విడిచిపోయిరి" (లూకా 10:30). యెరూషలేము కొండ ప్రాంతము. అక్కడ ఒలీవకొండ 2680 అడుగుల ఎత్తు కలది. యెరికో అయితే మృతసముద్రము ముఖ ద్వారమున యుండెను. గనుక ఒకడు యెరూషలేము నుండి యెరికో పోవాలంటే దిగి వెళ్ళవలసినదే.

బైబిలు యదార్థతను నిరూపించుట కొరకు మిగతా కొన్ని సంగతులు కూడా చెప్పుకొనవచ్చును. అది చారిత్రాత్మకంగా వాస్తవము. దానిలో 66 పుస్తకములు 1600 సంవత్సరముల కాలములో వ్రాయబడినను, 40 మంది లేఖకులు అందు కొరకు వినియోగింప బడినను, దానిలో గొప్ప ఐక్యత ఉన్నది. దాని వర్తమానము గొప్పది. గనుక బైబిలు యదార్థము. నిజంగా అది దేవుని ఊపిరి వలన కలిగిన గ్రంథము.

– గేరీ హేంప్టన్

# రక్షణ, ఎవరికి అవసరము ?

## ( Salvation, Who needs it ?)

"సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్తపడుడి" (2 పేతురు 1:10). "జీవముకు పోవు ద్వారము ఇరుకును ఆదారి సంకుచితమునై యున్నదని" యేసు చెప్పెను (మత్తయి 7:13,14). పరలోకములో ప్రవేశించుట ఎంత కష్టమో యేసు చెబితే, దానిని గూర్చి శిష్యులు ఆశ్చర్యపడిరి. ప్రభువా రక్షణ పొందువారు కొద్దిమందేనా? అని వారాయనననడిగిరి (మత్తయి 19:23-26; లూకా 13:23,24). అలాగైతే ఎవరు రక్షణ పొందగలరని వారడిగిరి. గనుక ఎవరు రక్షణ పొందగలరో, రక్షణ ఎవరికి అవసరమో తెలిసికొందము.

**భక్తిపరులకు రక్షణ అవసరము :-**

(అపో.కా.2:1-47). క్రీ॥శ॥ 33లో యేసు పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకోస్తునాడు యెరూషలేములో ఆకాశము క్రింద నుండు ప్రతి జనములో నుండి వచ్చిన భక్తిగల యూదులు కాపురముండిరి (అపో.కా. 2:5). వారు వలు ప్రాంతముల నుండి, బహూదూరము నుండి, వ్యయప్రయాసల కోర్చి అక్కడ కూడియుండిరి. అంత భక్తి శ్రద్ధలు గలవారికి రక్షణ అవసరమా? వారు నశించిన స్థితిలో యున్నారని, రక్షింప బడుటకు చర్య తీసుకోవాలని పేతురు వారికి బోధించాడు (అపో.కా. 2:22, 37-38). యేసునందు విశ్వసించి, మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము వారు బాప్తిస్మము పొందాలని పేతురు మూడువేల మందిని ఆనాడు ఒప్పించాడు (అపో. కా. 2:37-41). బాప్తిస్మము పొందిన వారిని ప్రభువు తన సంఘముతో

చేర్చెనని గ్రంథ కర్తయైన లూకా వ్రాసాడు (అపొ.కా. 2:47).

నేడు కూడ భక్తిపరులైన వారనేకులకు రక్షణ అవసరము. వారు మార్పుజెందాలి. భక్తి కంటె ఎక్కువను దేవుడు చూచుచున్నారు. అట్టి వారి భక్తి పూర్వక చర్యలు ఆయన వాక్యమ ననుసరించి యున్నావో లేదోయని ఆయన గమనించు చున్నారు (కీర్తన 19:8). అబద్ధ సిద్ధాంతములకు మతశాఖలకు కట్టుబడి భక్తిగా యుంటే రక్షింపబడలేము (గలతీ 1:6-9; రోమా 9:2,3; 10:1-3).

**అద్భుతముల వలన మోసగించబడిన వారికి రక్షణ అవసరము :-**

గారడీవాడైన సీమోను బహుకాలము గారడీ చేయుచు సమరయ ప్రజలను విభ్రాంతి పరచు చుండెను. దేవుని మహాశక్తి యనబడిన వాడు ఇతడేయని వారు చెప్పుకొను చుండిరి (అపొ.కా.8:10,11) గాని వారు దేవుని యొక్క నిజశక్తిని చూచి, ఆయన సత్యవాక్యమును ఫిలిప్పుద్వారా విని వారు యేసు వైపు మార్పు జెంది బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 8:12). వారివలెనేడు కూడ అనేకు లున్నారు.

సీమోను లాంటి గారడీవాళ్ళు నేడు అనేకులున్నారు. వారు గొప్ప "అద్భుతములు చేయు, స్వస్థత వరము" గల భక్తులమని ప్రకటించుకొంటారు. దేవుని మర్మములు తమకు తెలియునని, భవిష్యత్తును చెప్పగలమని వారు ప్రకటించు కొంటారు. అనేకులు ఈ గారడీవాని సమరయుల వలె వెంబడిస్తారు. అయితే ప్రజలనేలాగు ప్రలోభపెట్టాలో వారి 'అద్భుతక్రియలు' తెర వెనుక ముందే ఏలాగు ప్రాక్టీసు చేసుకొంటారో ప్రజలకు వారు తెలియ జెప్పరు. వారు సైకాలజీ చదువుదురు. వారి దగ్గరకు వచ్చే 'రోగులను' ముందే వాళ్ళు ఇంటర్వ్యూచేస్తారు. వారి గారడీతో ఏకీభవించిన వారు, గారడీ

చేస్తున్నవారు కూడ సత్యములోనికి మరలాలి.

ఇప్పుడు అద్భుతములన్నీ ఆగిపోయినవి (1కొరి 13:8-10). గాని యేసు పనిచేయుట విరమించు కోలేదు. ఆయన యొద్దకు వచ్చు వారిని ఆయన ఇప్పుడును రక్షించుచున్నారు (మత్తయి 11:28-30). బైబిలును బట్టియే మనకు తీర్పు తీర్చబడును గనుక, మన భక్తి విశ్వాసములు మన అభిప్రాయములు, మనోభావములపై గాక బైబిలు పైనే ఆధారపడియుండ వలెను.

**నిష్కపటులే అయినను సత్యమునకు విధేయులు కాని వారికి రక్షణ అవసరము (అపొ.కా.10:1-48) :-**

కొర్నేలి చాల మంచివాడు, భక్తి పరుడు, దానధర్మములు చేయువాడు (అపొ.కా.10:2). రక్షణ పొందనక్కర్లేని వాడుగా కొర్నేలి మనకగుపడుతాడు. అయితే రక్షణ పొందుటకేమి చేయవలెనో తెలిసికొనుటకు పేతురుకు కబురు పంపమని అతనికి తెలియ జేయబడినది (అపొ.కా. 10:48). నేడు అనేకులు సత్ప్రవర్తన గలవారు, దాన ధర్మములు చేస్తారు, చట్టప్రకారము జీవిస్తారు, బహుశా ఆదివారం చర్చికి వెళతారు, అయితే "మంచిగాయుంటేనే సరిపోదు. బాప్తిస్మము పొంది వారు క్రీస్తు సంఘ సభ్యులవ్వాలని" కొర్నేలి వారికి సలహా నిచ్చుచున్నాడు (గలతీ 3:26-27).

**దేవుని వాక్యమును బొత్తిగా ఎరుగని వారికి రక్షణ అవసరము (అపొ.కా. 10 : 30-34) :-**

ఫిలప్పియిలో పౌలు సీలలను బంధించియుంచిన చెరసాల అధిపతి యూదుడు కాదు, అందువలన రాబోవు రక్షకుని గూర్చి పాతనిబంధన చెప్పునది అతడెరిగినవాడు కాదు (అపొ.కా. 16:31). అతడు ప్రభువైన

యేసు నందు విశ్వాసముంచవలెనని పౌలు, సీలాలు చెప్పగా అతడును, అతని యింటివారును బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 16:34). గనుక క్రీస్తును గూర్చి ఎరుగని వారు ఆయనను గూర్చి విని, విశ్వసించి, బాప్తిస్మము పొంది రక్షణ పొందుట అవసరం.

**పాపములో జీవించుచున్న వారికి రక్షణ అవసరము (అపొ.కా. 18:8) :-**

మొదటి శతాబ్దములో కొరింథులో యున్నవారు అక్రమము, అవినీతితో జీవించుచున్నవారు, వారికి సువార్త బోధించుటకు అపొ. పౌలు భయపడ్డాడు (అపొ.కా.18:9, 10; 1కొరి 2:3). గాని ప్రభువు పౌలును కొరింధునకు పంపించారు. దేవుని వాక్యమును విని అనేకులు విశ్వసించి బాప్తిస్మము పొందారు. ఎంత ఘోర పాపినైనను రక్షించే దేవుని శక్తి, సువార్తయై యున్నది (రోమా 1:16).

త్రాగుబోతులు, వ్యభిచారులు, దొంగలు, మాదకపదార్థముల బానిసలు మొదలైన వారినందరినీ మార్చగల శక్తి సువార్తలో యున్నది. యేసు ప్రభువు పాపులతోను, సుంకరులతోను సహవాసము చేసారు. వారిని బాగుచేసారు (లూకా 7:34). నేడు కూడా ఆయన అట్టివారిని బాగుచేస్తారు. ప్రజలు మారుదురు అది సులభం కాదు కాని, ఇది సాధ్యమే. నన్ను బలపరచు వానియందే నేను సమస్తమును చేయగలనని పౌలు చెప్పాడు (ఫిలిప్పీ 4:13). నీవు పాపములో జీవించువాడవైతే రక్షణ నీకవసరము.

**గతంలో సరిగా బాప్తిస్మము పొందని వారికి రక్షణ అవసరం (అపొ.కా. 19:1-6):-**

ఎఫెసు పట్టణంలో పౌలు గతంలో బాప్తిస్మము పొందిన కొందరి శిష్యులను పౌలు కనుగొన్నాడు.

అయితే వారు సరిగా బాప్తిస్మము పొందలేదు గనుక వారు ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము పొందాలని వారికి బోధించాడు. నేడు కూడ గతంలో పలువిధాలుగా, పలు కారణాల కొరకు బాప్తిస్మము పొందిన వారున్నారు. వారు రక్షింపబడుటకు లేఖనార్థమైన బాప్తిస్మము పొందాలి. కొందరు పసిపిల్లలుగా యున్నప్పుడో, పెద్దలైనప్పుడో చిలకరింపు పొంది యుండవచ్చును. మరికొందరు బాప్తిస్మమునకు ముందే రక్షింపబడ్డారని బోధింపబడి యుండవచ్చును. ఇంకా కొందరు వేర్వేరు విధానాల్లో బాప్తిస్మము పొంది యుండవచ్చును. ఇట్టి వారందరు రక్షింపబడాలంటే క్రీస్తు బోధించిన బాప్తిస్మము పొందాలి (మార్కు 16:16; అపో.కా. 22:16; 1పేతురు 3:21; అపో.కా. 2:38).

రక్షణ ఎవరికి అవసరము ? మనకందరికీ యని మనమెరుగుదుము. దేవుడు నిన్ను రక్షించాలని కోరు చున్నారు. సాతాను నిన్ను తన పక్షమున చేర్చుకోవాలను కొను చున్నాడు. నీవెవరి పక్షము నుంటావు?

–అలెన్ వెబ్‌స్టర్

## శిష్యత్వపు బాధ్యతలు

### (Demands of Discipleship)

గొప్ప బాధ్యతలు కోరుచున్న యుగంలో మనము జీవించు చున్నాము. ఉద్యోగంలోను, స్కూలు లోను, గృహంలోను మనము అనేక బాధ్యతలు ఎదుర్కొనుచున్నాము. శిష్యత్వపు బాధ్యతలు కూడ యున్నవని క్రైస్తవులు గ్రహించాలి. మనము శిష్యులమయ్యే హక్కు లేకపోయి నప్పుడు మన పాపములకు పరిపూర్ణ బలి అర్పించే బాధ్యతను దేవుడు నెరవేర్చవలసి యుండెను. ఈ బలి 1 పేతురు 1:19లో వర్ణించబడెను.

అమూల్యమైన రక్తముచేత అనగా నిర్దోషమును నిష్కంళకమునగు గొర్రె పిల్ల వంటి క్రీస్తు రక్తము చేత మీరు విమోచింపబడితిరని మీరెరుగురు గదా".

శిష్యుడు అనగా వెంబడించు వాడు, నేర్చుకొనువాడు, మనం క్రీస్తు యొక్క శిష్యులుగా యుండాలంటే కొన్ని షరతులు నెరవేర్చాలి. వాటిని గూర్చి బైబిలు యేమి చెప్పుచున్నదో చూద్దాం.

మొదటిగా మనం మనుష్యులను పట్టు జాలరులుగా యుండాలి. యేసు పేతురును, అంద్రెయను శిష్యులుగా పిలిచినప్పుడు "నన్ను వెంబడించుడి, నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులుగా చేతునని'' చెప్పెను. నీవు మనుష్యులను పట్టు జాలరిగా యుండ గోరితే నీవు ఉద్యోగస్థుడవే.

రెండవదిగా, నీవు శిష్యునిగా యుండగోరితే కొంత ఘర్షణ యుండును. లూకా 14:26లో యేసు "ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని, తల్లిని, భార్యను, పిల్లలను, అన్నదమ్ములను, అక్కచెల్లెండ్రను తన ప్రాణముతో సహా ద్వేషింప కుంటే వాడు నా శిష్యుడు కానేరడు" అని చెప్పెను. మన కుటుంబ సభ్యులకంటే క్రీస్తును మనం ఎక్కువ ప్రేమించాలి. దీని వలన కొంత ఘర్షణ తప్పక ఉద్భవిస్తుంది.

నాల్గవదిగా, శిష్యుడు తన సిలువ నెత్తుకొనాలి. మత్తయి 10:38 లో యేసు ''తన సిలువ నెత్తుకొని నన్ను వెంబడింపని వాడు నాకు పాత్రుడు కాదు. తన ప్రాణము దక్కించుకొను వాడు దానిని పోగొట్టుకొనును, గాని నా నిమిత్తము తన ప్రాణము పోగొట్టు కొనువాడు దానిని దక్కించుకొనునని చెప్పెను. మొదటి శాతాబ్దములో ఎవడైనను సిలువను మోయుచున్నట్లు అగుపడితే వాడు సిలువ వేయ బడుటకు

కొనిపోబడు చున్నాడని యర్థము. నీవు నీ సిలువను మోస్తే పౌలు వలె క్రీస్తు యేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను దురాశలతోను సిలువ వేసియున్నారని చెప్పగలరు (గలతీ 5:24).

ఐదవదిగా శిష్యుడు **నేర్చుకొను వాడైయుండాలి.** లూకా 11:1లో శిష్యుడొకడు యేసునొద్దకు వచ్చి "ప్రభువా, మాకు ప్రార్థన చేయ నేర్పుమని" అడిగెను. వారు నేర్చుకొన గోరారు. నాటికి నేటికి ఎంత వ్యత్యాసమో! మరల "మీరు నా వాక్య మందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుందురని" యేసు చెప్పెను (యోహాను 8:31).

అరవదిగా, **శిష్యుడు ఫలించు వాడై యుండాలి.** యోహాను 15:8లో యేసు "మీరు బహుగా ఫలించుట వలన నా తండ్రి మహిమ పరచబడును. ఇందు వలన మీరు నా శిష్యులగుదురని" తన శిష్యులకు చెప్పెను.

ఏడవదిగా, శిష్యుడు తన **సహోదరులను ప్రేమించును.** యోహాను 13:34లో "మీరు ఒకని యెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దీనిని బట్టి మీరు నా శిష్యులని అందరు తెలిసికొందురని" యేసు చెప్పెను.

అవును, శిష్యత్వము యొక్క బాధ్యలు గొప్పవి. ఈ బాధ్యతలన్నియు తప్పక నెరవేర్చబడాలి. మనం వాటిని నెరవేర్చకపోతే నరక ద్వారములు మనలను ఎన్నటికీ మ్రింగివేస్తాయి.

- జాన్ స్టేసీ



# సంఘము అంత ప్రాముఖ్యమా ?

## ( Is the Church Really that Important ? )

మతశాఖల ఆర్గనైజేషన్‌ను, అందున్న దశల వారి అధికారులను చూచి విసికి చెంది సంఘము అంత ప్రాముఖ్యము కాదంటారు. గనుక ఎవరి దారివారిదే యనే ధోరణిని వారు వ్యక్తపరుస్తారు. డినామినేషన్లు అంత ప్రాముఖ్యము కాదు. గాని క్రీస్తు స్థాపించిన సంఘము ప్రాముఖ్యమే. దేవునితో నిజమైన ఆత్మీయ సంబంధము కలిగి యుండుటకు క్రీస్తు సంఘములో సభ్యునిగా యుండుట అత్యవసరము. అది ఒక డినామినేషన్ కాదు, మానవ కల్పిత ఆర్గనైజేషన్ దానికి లేదు. దిగువ సంగతులు గమనించుము.

సంఘము పరలోకములో జన్మించినది గనుక అది చాలా ప్రాముఖ్యము :

సంఘాన్ని గూర్చి అనేకులు అది మానవ కల్పితమని తలంచి ఉదాసీనత కలిగి యుందురు. అది నిజానికి మానవ కల్పితమే అయితే మనందరము దానిని వ్యతి రేకించాలి. అయితే క్రొత్త నిబంధనలో మనకు కనబడు సంఘము దైవికమైనది. అది దైవిక ఆరంభమును కలిగి యున్నది. దేవుని నిత్యసంకల్పములో సంఘము ఉండెను. అది క్రీస్తులో నెరవేరెను. "దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసు నందు చేసిన నిత్యసంకల్పము చొప్పున పరలోకములో ప్రధానులకును, అధికారులకును సంఘము ద్వారా తన నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియ జేయబడవలెనని ఉద్దేశించెను" (ఎఫెసీ 3:10-11). సంఘము యొక్క ప్రాముఖ్యతను నిర్లక్ష్యము చేయు ఏ ప్రయత్నమైనను, దేవుని రక్షణ సంకల్పము లోపభూయిష్టమైనదని చెప్పుచున్నట్లుగును. సంఘము స్థాపించబడిన తరువాత రక్షింపబడిన

ప్రతి వారును ఆయన ప్రియకుమారుడు స్థాపించిన సంఘముతో చేర్చబడునని సర్వశక్తిమంతుడైన దేవుడు నిర్ణయించారు (అపో.కా. 2:4). సంఘము అంత ప్రాముఖ్యము కాదు, క్రైస్తవ్యానికి అది అడ్డుబండయనుట యెహోవా దేవుని జ్ఞానమును కించపరచుటయే యగును.

**సంఘము రక్తముచే కొనబడినది గనుక అది ప్రాముఖ్యమైనది :**

అది క్రీస్తుకు అంత ప్రాముఖ్యమైనప్పుడు మనకు ప్రాముఖ్యము కాదని ఎవరు చెప్పగలరు? యేసును ప్రేమించుచున్నామని ఆయనను వెంబడించు చున్నామని చెప్పుకొనే వారున్నారు. గాని ఆయన దేని కొరకు మరణించారో దానిని మన్నన చేయరు. సంఘమును సంపాదించు నిమిత్తము అయస తన రక్తాన్ని చిందించారు (అపో.కా. 20:28). యేసు సంఘాన్ని ఎంత ప్రేమించారంటే దాని కొరకు ఆయన తన ప్రాణమర్పించారు. ప్రభువు యొక్క వధువైన సంఘమును మనము చులకన చేయుట తప్పు. మనము క్రీస్తును అనుకరించాలంటే ఆయన తన ప్రాణ మర్పించిన సంఘమును ప్రేమించాలి.

**సంఘము మహిమలో ప్రవేశించునది గనుక అది ప్రాముఖ్యము :**

యేసు వరుడైయుండగా సంఘము ఆయన యొక్క వధువై యున్నది (ఎఫెసీ 5:22). ఆయన తన ప్రశస్త వధువు కొరకు నిత్యనివాసము ఏర్పరచుటకు వెళ్లియున్నారు (యోహాను 14:16). ఆ సిద్ధపరచిన స్థలమునకు తన వధువును తీసికొనివెళ్లుటకు ఒకానొక దినమందు ఆయన తిరిగి వచ్చును. అంతము వచ్చినప్పుడు ఆయన తన రాజ్యమైన సంఘమును తండ్రియైన దేవుని కప్పగించును (1 కొరింథి 15:24). ఆయన సంఘములో నమ్మకముగా జీవించిన

వారందరు తండ్రియైన దేవునితో, కుమారుడైన క్రీస్తుతో, పరిశుద్ధాత్మతో నిత్యము నివసింతురు. మరియు విమోచింపబడిన వారందరితో వారు నిత్యము నివసింతురు. అంత్యదిన మందు సంఘమును యేసుతండ్రికి సమర్పించువాడైతే సంఘము అంత ప్రాముఖ్యము కాదని ఆయన ఎన్నడు తలంచి యుండరు!

– పేట్రిక్ మోరిసన్

## ఆలోచించు!

పాత నిబంధనలో యాజకులను, యాజక ధర్మాన్ని దేవుడే నియమించారు. గాని దేవుడు భూమి మీద అవతరించినప్పుడు వారే ఆయనను పట్టుకొని చంపించారు! మొదటి శతాబ్ధములో యాజకులే పలుకుబడి గలిగిన రాజకీయ వేత్తలు. క్రీస్తు సంఘస్థులను, క్రైస్తవులను బంధించి, హింసించి, చంపించుటలో ఆనాడు యూదులు యాజకులే ప్రధాన పాత్ర వహించారు. అదంతా దేవుని నామాన్నే జరిగించారు! గాని హింస గొప్పగా ప్రబలి యున్న ఆ రోజులలోనే “యాజకులలో అనేకులు విశ్వాసమునకు లోబడిరి” యనే మాటలలో గొప్ప శక్తి, ఆదరణ కనబడుట లేదా? (అపొ.కా. 6:7).

నీకు మరణం సంభవించేటంత హింసను ఎదుర్కొన వచ్చును. గాని ధైర్యము తెచ్చుకొనుము. నిన్ను హింసించే వారినే మార్చే శక్తి క్రీస్తు సువార్తలో యున్నది (రోమా 1:16).

గమనిక : సత్యవాక్కు వలయు వారు సంవత్సరమునకు
50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.
Satya Vani, P.O. Box - 80, Kakinada - 533 001.

# సంక్షిప్త వార్తలు

2018 ఫిబ్రవరి ఆఖరి వారములో సోదరులు రిక్కీగూటం గారు థాయ్‌లాండ్‌లోను, మలేషియాలోను రోటరీ దరపున ప్రయాణించిరి. సమయము దొరికినప్పుడెల్లా అక్కడనున్న సంఘములను సహోదరులను దర్శించిరి.

2018 మార్చి 14వ తేదీ బుధవారం నాడు రిక్కీ గారి జ్యేష్ఠ కుమారుడు జస్టిన్ గూటం గారి పదియవ జన్మదిన వేడుకలు స్థానిక క్రీస్తుసంఘ ఆవరణలో ఘనముగా జరిగెను. ఆ సందర్భముగా రాత్రి వేళ ఏర్పాటు చేయబడిన కృతజ్ఞత కూటములో సోదరులు ఎస్. యేసురత్నం గారు, వి. సుదర్శనరావ్ గార్లు చక్కటి వాక్యపరిచర్య చేసిరి. హాజరైన వారందరికీ రిక్కీ దంపతులు చక్కటి విందు నేర్పాటు చేసిరి. మరుసటి రోజు రాత్రి రిక్కీ గారి గృహములో పట్టణ ప్రముఖులకు, సంఘనాయకులకు విందు ఏర్పాటు చేయబడెను. వచ్చిన వారందరు రిక్కీ గారిని, జస్టిన్ గారిని అభినందించిరి, శుభాకాంక్షలు తెలిపిరి.

2018 ఫిబ్రవరి 13వ తేదీ మంగళవారం నాడు వి.కె.రాయపురం, పొట్టిలంకలో యున్న క్రీస్తు సంఘము ఒక తాత్కాలిక భవనము కొరకు తాము సేకరించిన స్థలములో పునాది వేసి, భవన నిర్మాణము ప్రారంభించిరి. సోదరులు జాషువా గూటం గారును, దొండపాటి రవీంద్రనాథ్ గారును తదితరులందరును కలిసి ప్రార్థనపూర్వకముగా పునాది వేసిరి. వెంకట కృష్ణరాయపురంలో సోదరులు దొండపాటి రాజారత్నం గారు నిర్విరామకృషి చేయుచు ఇప్పటికే లాకుల దగ్గర ఒక శాశ్వత భవనమును నిర్మించి అక్కడ క్రీస్తుసంఘ పరిచర్యలను జరిగించుచున్నారనునది చదువరులకు విదితమే!

2018 మార్చి 25వ తేదీ సాయంకాలమున రిక్కీ గారు కుటుంబ సమేతముగాను, తమ తల్లిగారైన కవితా గూటం గారితోను అమెరికా దేశపర్యటన నిమిత్తము పయనమై వెళ్ళిరి. మార్చి 28వ తేదీ నుండి టెన్నీస్‌లో మెంఫిస్ పట్టణములో జరుగుచున్న బైబిల్ లెక్చర్‌షిప్‌లో వీరందరు పాల్గొందురు. మరియు

ఏప్రియల్‌లో అమెరికాలో జరుగనున్న ఇండియా (మిషనరీ) సువార్తికుల సదస్సులో కూడ రిక్కీ గారు పాల్గొందురు. ఈ రెండు చోట్లను ఆయన ప్రసంగించే అవకాశమున్నది. మరియు అమెరికాలో యున్న జాషువా గారి రెండవ కుమారుడు రోనీ గూటం దంపతులకు ఏప్రియల్ రెండవ వారములో దేవుడను గ్రహించు ప్రథమ సంతానఫలము కొరకును, హరితా గూటం గారి సుఖ ప్రసవము కొరకును చదువరులు ప్రార్థించమనవి.

సత్యవాణి ద్వారా నిర్వహించబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో ఇప్పటికే కొన్ని లక్షల మంది చేరియున్నారు. ఆ కోర్సు పూర్తిచేసిన వారందరికీ ఒక బైబిలు ఉచితముగా ఇయ్యబడుచున్నది. ఇప్పటికే అనేక వేలమంది ఈ రీతిగా బైబిలును సంపాదించుకొనియున్నారు. మీరును, మీ సంఘస్థులును ఆ కోర్సులో చేరి ఆత్మీయముగా మేలు పొందాలంటే ఇప్పుడే మీ అడ్రసును సత్యవాణి ఆఫీసుకు తెలియజేయండి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2018-20

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.